సాక్షి నిర్మల్

శుక్రవారం, 9, మే, 2025



గోదావరి.. జల సిరి

దక్షిణ భారతావనికి తెలుగు రాష్ట్రాలకు అన్నపూర్ణగా విలసిల్లుతున్న గోదావరినది బాసర గుండా ప్రవహిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో దూసుకెళ్తోంది.

10లో▸



గుంతల రోడ్లతో తిప్పలు

తానూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /27.3

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కూడా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

బాల పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన 5 నుంచి 18 ఏళ్ల లోపు బాల బాలికల నుంచి ప్రధానమంత్రి బాల పురస్కారాల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. అర్హులైన వ్యక్తులు, సంస్థలు https://awards.gov.in/ వెబ్‌సైట్ ద్వారా జూలై 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8247685975, 9963738012 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్..!

కుంటాల: కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు కుంటాల పీఏసీఎస్ సీఈవో మురళీకృష్ణను సస్పెండ్ చేస్తున్నట్లు డీసీవో పల్లె పాపారావు తెలిపారు. కుంటాల మండలంలోని అందాకూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో వసతుల లేమిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సెంటర్ ఇన్‌చార్జి భోజేందర్ నుంచి వివరణ కోరారు. అనంతరం సీఈవో సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈమేరకు డీసీవో గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అవార్డు గ్రహీతలకు ఎస్పీ అభినందన



ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌చైన్‌గేట్: గత వర్షాకాలంలో డయల్ 100కు వచ్చిన కాల్‌కు స్పందించి ముగ్గురి ప్రాణాలు కాపాడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా తెలంగాణ రియల్ హీరోస్ అవార్డుని అందుకున్న భైంసా సీఐ గోపీనాథ్, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్‌ను ఎస్పీ జి.జానకీషర్మిల గురువారం అభినందించారు. మంచి పనులు చేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

గ్రామీణాభివృద్ధి సంస్థకు అవార్డు



రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) రాష్ట్రస్థాయి అవార్డు కైవసం చేసుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడమే కాక, రికవరీలోనూ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ అవార్డును ప్రదానం చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, డీపీఎం జ్ఞాను, ఏపీఎం సుదర్శన్ అవార్డు స్వీకరించారు.

ఎల్‌ఆర్ ఎస్.. రాయితీకి నో..



- జిల్లాలో దరఖాస్తుదారుల స్పందన అంతంతే..
- మూడుసార్లు పెంచినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- 44,602 దరఖాస్తులు.. ఫీజు చెల్లించింది 7,256 మాత్రమే

వివరాలు..

జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు	44,602
ఫీజు చెల్లింపునకు అర్హులు	37,939
ఫీజు చెల్లించిన వారు	7256
ప్రొసీడింగ్ పొందినవారు	2,455
సమకూరిన ఆదాయం	రూ.14.40 కోట్లు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) కింద అనధికార లేఔట్లలోని స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన 25 శాతం రాయితీ గడువు ముగిసినా ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. మార్చి, 31, ఏప్రిల్ 30, మే 3 వరకు మూడుసార్లు గడువు పొడిగించినా, స్థల యజమానులు పెద్దగా ముందుకు రాలేదు. జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు, 18 మండలాల్లో కలిపి కేవలం రూ.14.40 కోట్ల ఆదాయం సమకూరింది. 2020లో రూ.1,000 ఫీజుతో దరఖాస్తు చేసుకున్నవారి క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ, తక్కువ స్పందనతో లక్ష్యాలు చేరలేదు.

దరఖాస్తులు, ఫీజు చెల్లింపులు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 44,602 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు అందగా, 37,939 దరఖాస్తులు ఫీజు చెల్లింపునకు అర్హత పొందాయి. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో 26,537 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 21,850 అర్హత పొందగా, 4,026 మంది ఫీజు చెల్లించారు, రూ.8.27 కోట్ల ఆదాయం సమకూరింది. 18 మండలాల్లో 18,065 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 16,089 అర్హత పొందగా, 3,230 మంది ఫీజు చెల్లించారు. రూ.6.13 కోట్ల ఆదాయం జమ అయింది. నిర్మల్ మున్సిపాలిటీ రూ.7.02 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది, ఖానాపూర్‌లో కేవలం రూ.3 లక్షల ఆదాయం వచ్చింది.

పత్తాలేని ప్రొసీడింగ్స్..

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారు ప్రొసీడింగ్స్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారుల ఆమోదం సరిపోగా, ఇప్పుడు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అంగీకారం కూడా తప్పనిసరి. ఈ మూడు శాఖల ధ్రువీకరణ పూర్తయితేనే క్రమబద్ధీకరణ పత్రాలు జారీ అవుతాయి, దీనివల్ల ఆలస్యం, ఇబ్బందులు తప్పడం లేదు. రాయితీ గడువు ముగిసిన నేపథ్యంలో, మరోసారి గడువు పొడిగించే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

మున్సిపాలిటీలు, మండలాల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఫీజు చెల్లించిన వారు	చెల్లించిన సొమ్ము
నిర్మల్	15,515	2,919	రూ.7.02 కోట్లు
భైంసా	9,058	468	రూ.95 లక్షలు
ఖానాపూర్	1,928	182	రూ.3 లక్షలు
18 మండలాల్లో..	18,065	3,230	రూ.6.13 కోట్లు

నెరవేరని లక్ష్యం..

ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలన్న లక్ష్యం నెరవేరలేదు. అధిక ఫీజులు, సంక్లిష్ట పరిశీలన ప్రక్రియ, ప్రజల్లో అవగాహన లేమి స్పందన తగ్గడానికి కారణాలుగా అధికారులు గుర్తిస్తున్నారు. సరళమైన ప్రక్రియలు, అవగాహన కార్యక్రమాలతో ఈ పథకాన్ని మరింత ప్రజాదరణ పొందేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టెన్త్ టాపర్లకు కలెక్టర్ డిన్నర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, జడ్జి శ్రీవాణి



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న జడ్జి, కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం రాత్రి డిన్నర్ ఏర్పాటు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే వారితో కలిసి భోజనం చేస్తానని కలెక్టర్ గతంలోనే ప్రకటించారు. ఈమేరకు తన క్యాంపు కార్యాలయంలో 13 మందికి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. వారి అభిప్రాయాలు, లక్ష్యాలు తెలుసుకున్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకుని కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జీవితానుభవం ఎక్కువ ఉంటుందన్నారు. సమస్యల పరిష్కార నైపుణ్యం ఉంటుందని తెలిపారు. ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ మీరు సాధించిన విజయం జిల్లాకు గర్వకారణమన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ, ఇతర అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. తర్వాత చిరు కానుకలు అందించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఈవో పి.రామారావు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

20న బీడీ కార్మికుల సమ్మె



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో బీడీ కార్మికులు పాల్గొంటారని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ బీడీ ఫ్యాక్టరీలో యాజమాన్యాలకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కనీస వేతనాలు అమలు, కనీస పెన్షన్ రూ.9 వేలు, నాలుగు లేబర్ కోడ్‌లు, పని గంటల పెంపు తదితర సమస్యలపై జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో బీడీ కార్మికులు, బీడీ ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. నోటీసులు ఇచ్చినవారిలో కార్మిక సంఘ నాయకులు కిషన్, పోశెట్టి, రాజేందర్, లక్ష్మణ్, రవి, ఎల్లయ్య, గంగామణి, కమల, గంగాధర్, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అంబులెన్సు సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ సురేశ్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి పర్యవేక్షకుడు గోపాల్ సింగ్, వైద్యాధికారులు సౌమ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుని కుటుంబానికి అండగా ఉంటాం..

సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌సాగర్ దుబాయ్‌లో ఇటీవల హత్యకు గురయ్యాడు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చారు. గురువారం ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. కలెక్టర్ బాధితులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రేమ్‌సాగర్ భార్య ప్రమీల, పిల్లలు, తల్లి లక్ష్మి ఉన్నారు.

'భూభారతి' రైతులకు వరం

కుంటాల: భూభారతి చట్టం రైతులకు వరమని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నా రు. మండలంలోని కల్లూరు, లింబా(కె), విఠాపూర్ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విఠాపూర్‌లో రెవెన్యూ సదస్సును డీపీవో శ్రీనివాస్ పరిశీలించారు. తహసీల్దార్లు కమల్‌సింగ్, ఎజాజ్ అహ్మద్ ఖాన్, ప్రవీణ్‌కుమార్, డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తొట్టెలను పరిశీలించిన అధికారులు

సాక్షి స్పందన



నీటి తొట్టెను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

తానూరు: గ్రామీణ ప్రాంతాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు గతంలో అధికారులు నీటి తొట్టెలను నిర్మించారు. కొన్ని చోట్ల ఉపయోగంలో ఉన్న చాలాచోట్ల నీటి వసతి లేక నిరుపయోగంగా మారాయి. దీనిపై 'సాక్షి'లో లక్ష్యం ఘనం ..నిర్వహణ శూన్యం' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు గురువారం ఝరి(బి)తండాలోని నీటి తొట్టెను పరిశీలించి మరమ్మతులు ప్రారంభించారు.

సైనికులకు సంఘీభావం



జాతీయ పతాకంతో కాలనీవాసులు

నిర్మల్‌చైన్‌గేట్: పహల్గాంలో హిందువులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి పలువురు ఉగ్రవాదులను మట్టుపెట్టిన త్రివిధ దళాల సైనికులకు జిల్లా వాసులు సంఘీభావం తెలుపుతున్నారు. పట్టణంలోని స్థానిక నాయిడివాడ వార్డ్ నంబర్ 2లో తాజా మాజీ కౌన్సిలర్ సాదం స్వప్న అరవింద్ , గల్లీ పెద్దల ఆధ్వర్యంలో స్థానిక సంజీవని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత సైనికులకు ధైర్య స్థైర్యం, శక్తి, యుక్తులను అందించి అండగా ఉండాలని హనుమాన్‌ను వేడుకున్నారు. కాలనీవాసులు కోర్తికంటి లింగన్న, గజ్జ పోశెట్టి, నాయిడి రమేశ్, రాంమహేశ్, దుబ్బ నారాయణ, లక్ష్మణ్, కూన రాములు, సుదర్శన్, రామ్‌మల్లేశ్, సాయినాథ్, పొలస భరత్, ఏపూరి ప్రమోద్ పాల్గొన్నారు.

ఐస్.. అయితే రోగాలు ఫ్రీ!

- చల్లని, తీయని జ్యూస్‌లపై అప్రమత్తత తప్పనిసరి
- ఐస్ ముక్కలు, రసాయన రంగులతో అనారోగ్యం
- జాగ్రత్త వహించాలంటున్న వైద్య నిపుణులు..



నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ ఎండల నుంచి ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లలో పండ్ల రసాలు, శీతల పానీయాలు తాగేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చిన వారు కూడా చల్లని జ్యూస్‌లతో రిలాక్స్ అవుతున్నారు. అయితే, ఈ జ్యూస్‌ల తయారీలో కృత్రిమ రంగులు, మలిన ఐస్, పాడైన పండ్ల వినియోగం ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అడుగడుగునా జ్యూస్ సెంటర్లు...

జిల్లాలో పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోనూ ఇబ్బడి ముబ్బడిగా జ్యూస్ సెంటర్లు వెలిశాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో అనేకమంది జ్యూస్‌లు తాగుతూ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. వివిధ రకాల పండ్ల రసాలు తయారు చేస్తూ జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు ఉపాధి పొందుతున్నారు.

కృత్రిమ రుచులు, రంగులు..

జ్యూస్ సెంటర్లలో ఆకర్షణ కోసం బాదం, పిస్తా వంటి కృత్రిమ ఫ్లేవర్ పౌడర్లు, కెమికల్ రంగులు వినియోగిస్తున్నారు. మలిన నీటితో తయారైన ఐస్ హానికర బ్యాక్టీరియాను కలిగిస్తాయి. నిల్వ చేసిన పండ్లలో ఫంగస్, ఈకోలి బ్యాక్టీరియా ఏర్పడి వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి సమస్యలకు దారితీస్తాయి. రోడ్డు పక్కన స్టాల్స్‌లో దుమ్ము, ధూళి కలిసే అవకాశం ఉంది. ప్లాస్టిక్ కవర్లలో జ్యూస్ తీసుకెళ్లడం కూడా ఆరోగ్యానికి హానికరం.

ఆరోగ్య రక్షణకు సూచనలు

వైద్య నిపుణులు తాజా పండ్లతో ఇంట్లో జ్యూస్ తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు. స్టాల్స్‌లో శుభ్రత, పండ్ల నాణ్యతను తనిఖీ చేయాలి. క్రిమిసంహారకాలతో పక్వానికి తెచ్చిన పండ్లు క్యాన్సర్ కారకాలను కలిగిస్తాయి. జీర్ణ సమస్యలు, గొంతు నొప్పి, దంత సమస్యలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి.

దుష్ప్రభావాలివీ..



- పండ్ల రసాల తయారీలో కలుషిత పదార్థాలు చేరడం, మురిగిపోయిన పండ్లను వినియోగించడం వలన హెపటైటిస్ బారిన పడే అవకాశం ఉంటుంది. దీంతో పచ్చకామెర్లు వస్తాయి..
- నిల్వ ఉంచిన పండ్లలో ఈకోలి బ్యాక్టీరి యా తయారవుతుంది. వాటిని సేవించిన వ్యక్తులు వాంతులు విరోచనాలతోపాటు టైఫాయిడ్ బారిన పడే ప్రమాదం ఉంది.
- నిల్వ ఉంచిన జ్యూస్ తాగడం వల్ల నులిపురుగుల సంక్రమణతోపాటు చిన్న పిల్లల్లో గొంతు నొప్పి వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. దంత సమస్యలు తలెత్తుతాయి.
- కృత్రిమ రంగులు, అపరిశుభ్రమైన ఐస్‌తో తయారు చేసిన జ్యూస్‌తో జీర్ణవ్యవస్థకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. క్రిమిసంహారక మందులతో పక్వానికి తెచ్చిన పండ్లను వినియోగించడం ద్వారా కూడా క్యాన్సర్ కారకాలు శరీరానికి చేరుతాయి.

అప్రమత్తత తప్పనిసరి...



వేసవికాలంలో సహజంగానే చాలామంది శీతల పానీయాలు సేవించేందుకు ఆసక్తి చూపుతారు. అయితే పండ్ల రసాలు జ్యూస్ సెంటర్లలో తాగేముందు అక్కడ పరిశుభ్రమైన వాతావరణం ఉందా లేదా చూసుకోవాలి. జ్యూస్ తయారీలో ఎటువంటి పండ్లు వినియోగిస్తున్నారు, కెమికల్స్ వాడుతున్నారా.. అనేది గమనించాలి. తాజా పండ్లు మాత్రమే పోషకాలను ఇస్తాయి. చిన్న పిల్లలకు జ్యూస్‌లు బయట తాగించొద్దు. ఇంట్లో తయారు చేసుకుని సేవించడం మంచిది.

– డాక్టర్ శశికాంత్, జనరల్ సర్జన్, నిర్మల్

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

కడెం: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెంట్, ఫస్ట్ ఎయిడ్ కిట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని లింగాపూర్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో గన్నీ సంచుల స్టాక్‌ను, కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. గన్నీ సంచుల కొరత లేదని, తూకం చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సుధాకర్, డీఎస్‌వో పాపయ్య, తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ శారద ఉన్నారు.

ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి



కడెం పీఏసీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



రేవోజీపేట కొనుగోలు కేంద్రంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

దస్తురాబాద్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని రేవోజీపేట కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేంద్రాల్లో ధాన్యం నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు గన్నీ సంచులు ఇవ్వడం లేదని అదపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మాయిశ్చర్ వచ్చినా తూకం వేయడం లేదని పేర్కొన్నారు. దీంతో రైతులు కల్లాలో పోసిన ధాన్యం రిజిస్టర్‌ను, ధాన్యం మాయిశ్చర్‌ను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ సీఈవో రాజేందర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఎస్‌వోను ఆదేశించారు. మాయిశ్చర్ వచ్చిన ధాన్యం వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


ప్రశాంత్ (ఫైల్)

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన బైండ్ల ప్రశాంత్ (32) దివ్యాం గుడు గత 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం అతని తండ్రి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుప్రియ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 59521, 8712659519 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

సైద్‌పూర్‌లో యువతి..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన యువతి (18) పక్షం రోజుల క్రితం సాత్నాల మండలంలోని సైద్‌పూర్‌లో గల అమ్మమ్మ ఇంటికి వచ్చింది. గురువారం ఆదిలాబాద్ పట్టణంలో ఉండే తన బంధువుల ఇంటికి వచ్చిన తర్వాత చిన్నమ్మ ఇంటికి వెళ్తానని చెప్పి బయల్దేరి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించక పోవడంతో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సఖీ సెంటర్ ముందున్న ఓ పాన్‌షాప్ ఎదుట బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతునికి 35 ఏళ్ల వరకు ఉంటుందని, తలకు ఎర్రటి రుమాల్, ఛాతిపై త్రిశూలం పచ్చబొట్టు వేసి ఉందని సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఎవరైనా గుర్తు పడితే పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


సంఘటన స్థలంలో గాయపడిన ఇర్ఫాన్

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.మండల కేంద్రానికి చెందిన ఇర్ఫాన్ ద్విచక్ర వాహనంపై లోకేశ్వరం వెళ్లి వస్తుండగా కాలినడకన వస్తున్న ఖానాపూర్‌కు చెందిన మహమ్మద్ హసీబ్ ఖాన్‌ను ఢీకొట్టాడు. ఇద్దరికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇర్ఫాన్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

భీమారం: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. మట్టితరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి విచారించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని డ్రైవర్లు అనపర్తి మధుకర్, ఇస్లావత్ శివరాం ఒప్పుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మధుకర్, శివరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి.. జల సిరి

దక్షిణ భారతావనికి తెలుగు రాష్ట్రాలకు అన్నపూర్ణగా విరాజిల్లుతున్న గోదావరినది బాసర గుండా ప్రవహిస్తోంది. సముద్రమట్టానికి 3,018 అడుగుల ఎత్తున గల పర్వత సానువుల్లో సన్నని ధారలా ప్రవహిస్తూ తెలుగు రాష్ట్రాల్లో దూసుకెళ్తోంది. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా త్రియంబకేశ్వర్ వద్ద బ్రహ్మగిరి పర్వతం నుంచి గోదావరి నది ప్రవహిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల గుండా ప్రజలకు తాగు, సాగునీటిని అందిస్తోంది. నది పరీవాహక ప్రాంతం ఎంతో మూడముచ్చటగా ఉంటుంది. నది ఒడ్డున ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. - భైంసా

- బాసర నుంచే దక్షిణ గంగ ప్రారంభం
- నదీ తీరంలో అనేక పుణ్యక్షేత్రాలు
- వేలాది ఎకరాలు సస్యశ్యామలం
- లక్షల మందికి ఉపాధి


గోదావరి నది

సమ్మర్ స్పెషల్

ఒడ్డునే అనేక ఆలయాలు...

గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో అనేక ఆలయాలు, నగరాలు కనిపిస్తాయి. మహారాష్ట్రలో నాసిక్, కొద్ది దూరంలోనే షిర్డీ, పక్కనే ఔరంగాబాద్, జాల్నా, మరోవైపు మనకు సమీపంలో నాందేడ్‌లోని సచ్‌కండ్ గురుద్వారాలు, గోదావరి నది ఒడ్డునే నిర్మితమయ్యాయి.

మన ప్రాంతంలో...

స్కందుడు నడియాడిన కందకుర్తి వద్ద మంజీర, హరిద్ర నదులను కలుపుకుని త్రివేణి సంగమంగా మారి బాసర వైపు గోదావరి ప్రవాహం కనిపిస్తుంది. నది ఒడ్డునే సరస్వతీ అమ్మవారి ఆలయం, లోకేశ్వరం మండలంలో బ్రహ్మేశ్వర ఆలయం, దిలావర్‌పూర్ మండలం సాంగ్వీలో సంగమేశ్వర ఆలయం, ధర్మపురి నరసింహస్వామి ఆలయం, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం నది ఒడ్డునే ఉన్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులకు గోదావరి నది కనువిందు చేస్తుంది. శుభ, అశుభ కార్యాల్లోనూ నది పరివాహక ప్రాంతాల్లో ఉండేవారంతా దక్షిణగంగగా కొలుచుకునే గోదావరి నదిలోనే పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

ఎంతోమందికి ఉపాధి...

ఇక్కడ ఉండే బ్రాహ్మణులు, బోట్లు తిప్పే వారికి ఉపాధి తెచ్చిపెడుతుంది. గోదావరి నది పొడవున జాలర్లు రోజూ చేపలు పట్టి జీవనం వెళ్లదీస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రెండు తెలుగు రాష్ట్రాల వరకు గోదావరి నదిపై ఎన్నో చోట్ల రోడ్డు, రైలు వంతెనలు కనిపిస్తాయి.

సాగునీరందిస్తూ...

మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి హయాంలో పైథాన్ వద్ద జయక్‌వాడీ ప్రాజెక్టు నిర్మించారు. ఇది ఔరంగాబాద్, జాల్నా, పర్బని జిల్లాల్లో 2,37,452 హెక్టార్ల భూమికి సాగునీరు అందిస్తోంది. మహారాష్ట్రలో సాగయ్యే చెరుకు పంటకు గోదావరి నది నీరే ఆధారం. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పర్బనీ, జాల్నా, నాందేడ్ జిల్లాల ప్రజలకు తాగునీటిని అందిస్తూ మన సరిహద్దులో బాబ్లీ ప్రాజెక్టు నుంచి బాసర వైపు ఈ నది ప్రవాహం కనిపిస్తుంది. ఉత్తర తెలంగాణకు పట్టెడు అన్నం పెట్టే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గోదావరి నదిపైనే నిర్మించారు. ఉత్తర తెలంగాణలో 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి వరి పంట పండేందుకు ఈ నీరే ప్రధానం. ఇక మిషన్ భగీరథలో భాగంగా నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు ఈ నది నుంచే తాగునీటిని అందిస్తారు.

అరేబియా సముద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మగిరిపై బిందువుగా మొదలైన గోదావరి నది తూర్పువైపునకు 1,465 కిలోమీటర్ల మేర సాగి బంగాళాఖాతంలో ముగుస్తుంది. తెలంగాణ వాసుల కల్పతరువు,

సముద్రంలో కలిసి...

ఆంధ్రుల అన్నపూర్ణగా పిలిచే గోదావరి నది నీటి ప్రవాహం కాళేశ్వరం గుండా భద్రాచలం మీదుగా ఉభయ గోదావరి జిల్లాల్లోకి ప్రవేశిస్తుంది. చివరగా ఒక పాయ యానం వద్ద మరొకటి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి చెంత సముద్రంలో కలిసిపోతుంది.

జాతీయస్థాయి పోటీలకు రెఫరీగా ఎంపిక


కళ్యాణ్

పాతమంచిర్యాల: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీగా జుమ్మిడి కళ్యాణ్ ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు తమిళనాడులోని తిరువన్నమలైలో నిర్వహించనున్న హెఫ్ఐ 40 సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలానికి చెందిన కళ్యాణ్ న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నట్లు వారు పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాకు చెందిన చిన్నం ధర్మేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీలోని కొనసీమ జిల్లాకు చెందిన ధర్మేందర్‌రెడ్డి పట్టుబడినట్లు తెలిపారు. అతన్ని తనిఖీ చేయగా రూ.11,750 నగదు, ఫైనాన్స్ చీటీలు, రిజిస్టర్లు దొరికినట్లు తెలిపారు. వాటితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని తెలంగాణ ఏరియా మనీలెండర్ యాక్ట్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆదివాసీ, గిరిజనులకు శిక్షణ తరగతులు

- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్


మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: ఆదివాసీలు, గిరిజనులను అన్ని రంగాల్లో చైతన్యపర్చడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, ఇందులో భాగంగా జన్నారంలో ఆదివాసీ, గిరిజన నాయకులకు మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన ఆదివాసీ, గిరిజనుల కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల కార్యక్రమం ఈ నెల 11, 12, 13వ తేదీల్లో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించారు. శిక్షణ తరగతుల ప్రారంభానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి ఆత్రం సుగుణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ సింగల్ విండో చైర్మన్ అల్లం రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్, పార్టీ సీనియర్ నేతలు గుర్రం మోహన్‌రెడ్డి, సయ్యద్ ఇసాక్, ఆర్.రమేష్‌రావు, ఇందయ్య, టౌన్ ప్రెసిడెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అభిమన్యు గ్రూప్‌కు అరుదైన గౌరవం


ప్రశంసపత్రం అందుకుంటున్న శేఖర్

నార్నూర్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 'నేనున్నాను' అని భరోసా కల్పిస్తూ మానవతా దృక్పథంతో వాట్సప్ గ్రూప్ ద్వారా సేవలందిస్తున్న మేస్రం శేఖర్ గురువారం కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి ఆర్థికసాయం అందించడంతో పాటు 20 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులు ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకునేలా ప్రభుత్వ ఆస్పత్రులపై వారికి నమ్మకం కలిగేలా అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

బొలెరో ఢీకొని ఒకరు దుర్మరణం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల మేరకు బోథ్ మండలంలోని సొకెరకు చెందిన కుందూరు రాజు (23), ఖుర్షీద్‌నగర్‌కు చెందిన దర్శనాల సునీల్ ద్విచక్ర వాహనంపై తిర్పెల్లి వైపు వెళ్తుండగా బొలెరో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రాజు సంఘటన స్థలంలోనే మృతి చెందగా సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


ఆయిటి రాజు (ఫైల్)

కుంటాల: బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఆయిటి రాజు (26)గురువారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఓలా గ్రామానికి వెళ్లి వస్తుండగా కుంటాలకు సమీపంలో సమీపాన బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: సెటిల్‌మెంట్, భూరికార్డుల కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ సర్వే ఆదేశాల ప్రకారం లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మీ సేవ కేంద్రాలలో ఈ నెల 17 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి జిల్లా ప్రధాన కేంద్రంలో 50 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ గణితంలో 60 శాతం మార్కులు, ఐటీఐ, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్) / డిప్లొమా సివిల్) / బీటెక్ సివిల్) సమాన అర్హత గల అభ్యర్థులు అర్హులన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

'ఆర్థిక విధ్వంసం సృష్టించిందే బీఆర్‌ఎస్'


మాట్లాడుతున్న రియాజ్

నార్నూర్: తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉండి ఆర్థిక విధ్వంసం సృష్టించిందే బీఆర్‌ఎస్ అని పార్టీ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, రాజ్యాంగాన్ని భారత్ గౌరవిస్తుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీని బదనాం చేస్తున్నాయన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు గౌరవం ఇవ్వాల్సిందేనన్నారు. ఇందిరమ్మ కమిటీ పారదర్శకంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. సమావేశంలో పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ మల్లయ్య గౌడ్, కుమురం భీం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పరమేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బిర్జిలాల్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: యూపీఎస్సీ, సీఎస్‌ఏటీ 2026 (సివిల్ సర్వీసెస్) పరీక్ష కోసం 100 మంది మైనార్టీ (ముస్లి, క్రిస్టియన్,సిక్కు, బౌద్ధ, జైన, పార్సీలు) అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని రిజర్వుడ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక పూర్తిగా మెరిట్ ప్రాతిపదకన ఉంటుందన్నారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని ప్రొఫెషనల్, సాధారణ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో https://cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, జూన్ 5న జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, వివరాలకు 040-23236112 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, ఒకేషనల్ తదితర కోర్సుల్లోని 2, 4, 6 సెమిస్టర్ల, బ్యాక్‌లాగ్ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్షల టైంటేబుల్‌ను గురువారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కే.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సెమిస్టర్ల వారీగా ఇలా..

- రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు.
- నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4న ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు.
- ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4, 10, 11, 12, 13, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయి.
- 6వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30, జూన్ 3, 5, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు.
- మొదటి సెమిస్టర్ పరీక్షలు జూన్ 17, 18, 20, 21, 23, 24, 25వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయి.
- మూడవ సెమిస్టర్ పరీక్షలు జూన్ 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంటాయి.

మెరుగైన వైద్యం కోసమే పల్లె దవాఖానాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


పల్లె దవాఖానా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో దవాఖానాలు ఏర్పాటు చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో గురువారం పల్లె దవాఖానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని దవాఖానాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహను కలిసి దయాలాసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరామని, త్వరలో ఈ ప్రాంతంలో దయాలాసిస్ సెంటర్ ఏర్పాటు కాబోతోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కలమడుగు గ్రామంలోని సిరిపల్లి బీరయ్యకు రూ.19వేలు, శ్రీనివాస్ రూ.18వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, వైద్యురాలు ఉమా శ్రీ, ఏఏఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిల్ కుమార్, స్థానిక పల్లె దవాఖానా వైద్యురాలు గంగాదేవి, ఎంపీడీవో హుమర్ షరీఫ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు దుర్గం లక్ష్మీనారాయణ, ఫసిహుల్ల, గ్రామ కార్యదర్శి వినోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

లింగాపూర్(ఆసిఫాబాద్): మండలంలోని రావునూర్ సమీపంలో ఈనెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చోర్‌పల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మర్సుకోల ప్రకాశ్ (39) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ మండలం రావునూర్‌కు చెందిన ఆత్రం భీంరావు, మారుబాయి దంపతులు బుధవారం గ్రామ సమీపంలోని చేను వద్ద పనిచేసి కాలినడకన ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాశ్ లింగాపూర్ నుంచి బైక్‌పై స్వగ్రామమైన చోర్‌పల్లికి వస్తుండగా రావునూర్ సమీపంలో ఆత్రం భీంరావును ఢీకొట్టాడు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో జైనూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉట్నూర్, ఆ తర్వాత ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆత్రం భీంరావు భార్య మారుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య రేణుకాబాయి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


ఇన్‌స్టాగ్రామ్‌లో వేధించిన యువకుడి అరెస్ట్

గుడిహత్నూర్: ఇన్‌స్టాగ్రామ్ ఫేక్ ఐడీ క్రియేట్ చేసి ఓ యువతిని వేధింపులకు గురిచేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ ఓ మహిళ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి మరో యువతి పరువు తీసేలా అసత్య ప్రచారం చేశాడు. విషయం తెలుసుకున్న సదరు బాధితురాలు షీటీంకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రాథమిక సాంకేతిక ఆధారాలు పరిశీలించి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో ఇతరుల మనో భావాలు దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

రౌడీషీటర్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన రౌడీషీటర్ కద్దుపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6న సాయంత్రం వినాయక్‌చౌక్‌లో బంగారుగూడకు చెందిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు తనతో రావాలని వేధించాడు. మహిళతో ఉన్న ఆమె తమ్ముడిపై కత్తితో దాడి చేశాడు. దీంతో బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు మహిళను వేధించిన కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో రౌడీషీటర్ కద్దు రెండు మర్డర్ కేసులతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు వివరించారు.

అగ్నిప్రమాదంలో కొట్టం దగ్ధం


మంటల్లో కాలుతున్న కొట్టం

బోథ్: మండల కేంద్రంలోని సెరె గుండయ్యకు చెందిన కొట్టం బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు రాత్రి 9 గంటల ప్రాంతంలో చేనులో మంటలు చెలరేగి కొట్టానికి అంటుకున్నాయి. గమనించిన స్థానిక రైతులు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా అప్పటికే కొట్టం పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, సామగ్రి దగ్ధమయ్యాయి. వాటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బాధిత రైతు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశాడు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్

నెన్నెల: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'గ్రామాలకు తరలిరండి' అనే కార్యక్రమాన్ని నెన్నెల, నందులపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల స్థితిగతులు, రైతులు, కార్మికులపై పాటలు పాడుతూ ప్రజలను చైతన్యపర్చారు. విద్యార్థులంతా ప్రజల జీవన స్థితిగతులను అధ్యాయనం చేయాలన్నారు. గ్రామాల్లో పేదలకు పక్కా ఇళ్లు, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పూర్వ ఉపాధ్యక్షుడు దుర్గం బ్రహ్మానందం, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, ఎం.గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: ప్రభుత్వ నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయకార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా, కనీస నిబంధనలు పాటించకుండా వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్నారు. సరిగ్గా నీటిశుద్ధి చేయకుండా వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు నీటి వ్యాపారం సాగిస్తున్నారని విమర్శించారు. వాటర్ ప్లాంట్‌ల నిర్వహణపై ప్రభుత్వ అధికారులు ఏమాత్రం దృష్టి సారించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెంటనే వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేసి నిబంధనలు పాటించని యాజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.